# విశ్రామధామం

-సౌత్‌హిల్స్

చి.సౌ.విమల,

శుభాశీస్సులతో మీ అత్త వ్రాయునది. మేమిద్దరం ఇచ్చటకు కులాసాగా చేరాము. మీరందరూ క్షేమమని తలంచెదను. మేమిలా వూళ్లోకి వస్తున్నామో లేదో వూరి జనం అంతా అరుగుల మీద నుంచుని వాళ్ల ఆశ్చర్యకరమైన చూపుల తోరణాలతో, మందహాస వదనారవిందాలతో మాకు స్వాగతం పలికారు. పని చేసే అచ్చాయమ్మ 'అమ్మగోరూ! వచ్చేసారా? ఎంతకాలమైంది మిమ్మల్ని చూసి! బాగున్నారా? ఇదిగో మీ ఇంటికి వచ్చేత్తున్నా ఇప్పడే" అంటూ మమ్మల్ని వెంబడించింది.

చుట్టుపక్కలవాళ్ల పలకరింపులు, చిలకరింపులు ఇంక చెప్పనే అక్కర్లేదు. పాలు పట్టుకు వచ్చేవాళ్లు, కూరగాయలు తెచ్చేవాళ్లు... ఓహ్ పళ్లు పట్టుకొచ్చేవాళ్లు, మన రత్తయ్య అయితే ఏకంగా అమృతపాణి అరటిగెల, చక్రకేళి అరటిగెల పట్టుకువచ్చి అరటి ఆకుల కట్టతో గుమ్మం దగ్గరకు వచ్చి నిలబడేసరికి మీ మామయ్యగారి ఆనందం పట్టపగ్గాల్లేవనుకో.

"రారా రత్తయ్యా'' అంటూ ఆప్యాయంగా అలా కౌగలించుకుంటూ ఇద్దరూ ఆనందభాష్పాలతో వొకర్ని ఒకరు హత్తుకుపోయారనుకో. మంగమ్మత్త, తాయారమ్మ, రత్తక్క... ఒక్కరేమిటి పెద్దలు, పిన్నలు అందరూ చుట్టుముట్టేసి వుక్కిరిబిక్కిరి చేసేసారు.

"అయ్యగోరూ, అమ్మగోరూ ఈ పల్లెటూరును మరసిపోయారనుకున్నామండీ? ఇంకెందుకు ఈడకు వత్తారూ? ఇంక రారు అనుకుంటూ మాలో మేము పందేలేసుకుంటున్నామండీ. ఎలా వున్నారు? మీరు లేకపోతే ఈ వీధేకాదు, ఈ వూరే సిన్నపోయిందనుకోండి'' అంటూ వాళ్లు అంటుంటే మా ఇద్దరి కళ్లు ఎడతెగని భాష్పాలతో నిండిపోయాయి. గబగబా అచ్చాయమ్మ ఇల్లు తుడిచేసి కడిగేసి ముత్యాల ముగ్గులు పెట్టేసింది. దాని మొగుడు రంగన్న గబగబా పూలు కోసి గుమ్మానికి బంతిపూల తోరణం, మామిడాకుల తోరణం కట్టేసి పెళ్లివారి ఇల్లులా ముస్తాబు చేసేసాడు. వెంటనే అటక మీంచి రాగి కాగు తీసి దొడ్లో ఇటికల పొయ్యిపై దాన్ని పెట్టి నిండా నీళ్లు పోసేసి అడుగున డొక్కలు, పిడకలు, కొబ్బరిమట్టలు పెట్టి నిప్పుతో అంటించి పెద్ద మంటతో నీళ్లు సలసలా కాచేసాడు. ఇద్దరం అలా వేపపుల్లలతో పళ్లు తోముకుని తనివితీరా ఆ వేడినీళ్లతో హాయిగా స్నానం చేసి సేద తీరేటప్పటికి మధ్యాహ్నాం పన్నెండయింది. అన్నం, కూర, చారు, వూరగాయతో ఆ పూటకు భోజనం ముగించాము. దొడ్లో పనసచెట్టు నిండు కాయలతో పరిపూర్ణ గర్భిణిలా మావైపు జాలిగా చూస్తోంది. మామిడిచెట్టు కాయలు తప్ప ఆకులు కనబడడంలేదు. అటు ప్రక్క మూలలో జామచెట్టు, అరటిచెట్లు, నూతికి దగ్గరగా మందారచెట్టు విరబూసిందనుకో. ఇంకో మూల జారిపోతున్న పందిళ్లు, వాటిపై విరజాజి, సన్నజాజి, వాటిపక్క మల్లెతోపు...పూల వాసనలు గుబాళిస్తున్నాయి. గులాబీలు నవనవలాడుతూ స్వాగతం పలుకుతున్నాయి నవ్వుతున్న ముఖాలతో. ఎంతకాలమైంది. మీ మామయ్యగారైతే ఒక్కొక్క చెట్టు దగ్గరా అలా నిలబడి పరీక్షిస్తూ రంగన్నకు ఏవేవో సూచనలిస్తున్నారు.

నాకైతే అమ్మలక్కలందరూ చేరి "అమ్మగోరూ! మీరు మళ్లీ రేపట్నుంచి సదవాల. మద్దాన్నమే వచ్చేత్తాం. ఆ పాటలు మీరే పాడాలా. ఆ గొంతు విని ఎన్నాళ్లయిందో. కుశలవుల యుద్ధం, వూర్మిళాదేవి నిద్ర... ఆ గీతాలు మీరే పాడాల. అవన్నీ మా చెవుల్లో అలా మార్మోగుతూ ఉన్నాయి'' అంటూ ఒకటే గొడవ.

"దానికేం భాగ్యం అలాగే...అలాగే'' అని వాళ్లని సముదాయించేటప్పటికి నా తలప్రాణం తోక్కవచ్చింది. సాయంత్రం అయింది. ఇద్దరం మన వూరి దేవాలయానికి వెళ్లాం. ఎంత మారిపోయిందనుకున్నావ్. రంగులు వేసారు. కోనేటికి మెట్లు కట్టారు. కోనేటి మధ్యలో చక్కని శివుని ప్రతిమ! చుట్టూ మంచి ఉద్యానవనం. పూజార్ల ఆప్యాయతల పలకరింపులు.

"మీరిద్దరూ లేకపోవడం గుడి నిద్ర పోతూ ఉన్నట్లుందండీ. మీరుంటే ఏదో కార్యక్రమం నిర్వహించేవారు. గుడి కళకళలాడుతూ ఉండేది. ఏదో జనం వస్తున్నారుగానీ కార్యక్రమం ఏదైనా వుంటే వచ్చే జనం వేరు. దేవునికి కూడా మిమ్మల్ని చూస్తే ఆనందం'' అని అంటుంటే మా మనస్సులు మరో లోకంవైపు మళ్లుతోంది.

రాత్రయింది. ఫలహారాలు ముగించాము. మళ్లీ ఆడవాళ్లు, మగవాళ్లు చేరారు. మీ మామయ్యగారు అలా పడక్కుర్చీలో కూర్చుని చుట్టూ చేరిన వాళ్లతో మాటల్లో మునిగిపోయారు. లోపల చావిట్లో నేనూ వచ్చిన వాళ్లతో మాటలాడుతూ కాలం మరచిపోయాము.

"మరి టీవీలు చూడడంలేదా?'' అని వాళ్లను అడిగాను.

"మీరొత్తే మాకు టీవీలెందుకమ్మా. అందులో ఇంట్లో సాలవన్నట్లు ఏడ్పులు, గోలలూ. ఏదో ఉదయంపూట భక్తివి వస్తాయని కాస్సేపు చూస్తున్నాం అంతే'' అంటూ ముక్తకంఠంతో అన్నారు.

"అయ్యగారు రామయణమో, భారతమో, భాగవతమో చెప్పమనండి. రాత్రిపూట మాకెప్పుడెప్పుడు వింటామా అని వుంది. మద్యాన్నం మీరేదైనా పాడితే వింటాం. మాకు చెవులు తుప్పుపట్టిపోయాయి. మీ కంఠం విని ఎన్నాళ్లయింది?'' అంటూ విన్నపాలు, వేడికోళ్లు.

"సరే సరే'' అంటూ వాళ్లని సముదాయించి సాగనంపాను. రాత్రి వొళ్లు తెలియని నిద్ర.

ఉదయమే దేవాలయం నుండి వినవస్తున్న సుప్రభాత గీతంతో మేలుకున్నాం. వెనుక వున్న కొబ్బరిమొక్కల దొడ్డిని అందమైన పార్కుగా మలచాలని మీ మామయ్యగారి తలంపు. అందులో మైకులు నలుమూలలా పెట్టి భక్తిగీతాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు వినిపించాలని వారి ఆశ. అలాగే వీధి గదిలో పెద్ద లైబ్రరీపెట్టి వుచితంగా అందరికీ పుస్తకాలు అందించాలని వారి తాపత్రయం. ఖాళీగా కూర్చోకుండా ఉదయం ఎనిమిది నుండి తొమ్మిది గంటలవరకు పిల్లలకు పాఠాలు చెప్పా

లని ఆయన ప్రణాళిక.

నేను నేర్చుకున్న కుట్లు, అల్లికలు ఇక్కడి మహిళామణులకు నేర్పడంతోపాటు కొన్ని కుట్టుమిషన్లు కొని కొంతమందికి జీవనోపాధి కలిగించాలని నా తలంపు. అలాగే కొబ్బరి ఈనెలతో చీపుళ్లు, కొబ్బరిపీచుతో తాళ్లు, కొబ్బరిచిప్పల బొగ్గులు, ఎండు కొబ్బరి నిల్వ చేసే విధానం, కొబ్బరినూనె పరిశ్రమ... ఇలా కొంతమందికి నేర్పితే వారికి ఉపాధి కల్పించినట్లు అవుతుందని తలంపు. మా ఇద్దరి ఆశయాలకు అనుగుణంగా ఈ పల్లెప్రజల్లో కొంత చైతన్యం కలిగించి వారి జీవితాల్లో వెలుగులు నింపాలనే కుతూహలంతో ఉన్నాము. ఆర్థికంగా మనకే ఇబ్బందుల లేవుకదా. ఈమాత్రం చైతన్యం తీసుకువస్తే చిమ్మచీకట్లో చిరుదీపం వెలిగించినట్లే!

ప్రతి విషయాన్ని ఆర్థిక సంబంధాలతో ముడిపెడితే ఎవరికీ మానసిక శాంతి లభించదు. డబ్బుతో అన్నింటినీ మనం కొనలేము. విశ్రాంతి అంటే గాంధీగారొక నిర్వచనం ఇచ్చారు 'ఒక పని నుండి మరొక పనికి మారడమే విశ్రాంతి' అని.



హాయిగా ఎవరి గూట్లో వారు పడి ఉండడమే ఆనందం. మేము రన్నింగ్‌రేస్ వంటి వాతావరణంలో ఇమడలేము. ఉరుకుపరుగుల జీవితాల్ని చూడలేము. ఆరాలు పోరాటాల జీవన తత్వాన్ని జీర్ణించుకోలేము. సెలయేరుల్లా దూకుడు దూకలేము. పిల్లకీ తొందరే, పెద్దలకీ తొందరే. ఉదయం లేచింది మొదలుకుని రాత్రి పడుకునేవరకు ఒకటే స్పీడు. ఒకటే వత్తిడి. ఒకటే టెన్షన్.

ఈ జీవన విధానాలకు మేమిద్దరం తట్టుకోలేము, పోటీ పడలేము. ఏదో కలో గంజో తాగి ఇంకా వొంట్లో వోపిక వుంది కాబట్టి మన ఇంట్లో మనం వుంటూ పదిమందికి మేలు చేకూరుస్తూ హాయిగా కాలక్షేపం చేయడంకంటే స్వర్గం ఇంకేముంటుంది? మాకదే విశ్రామధామం.

పిల్లల్ని వేధించకండి. వారి బాల్యాన్ని చదువుల బందిఖానాలో మ్రగ్గనీయకండి. వాళ్లకీ కొన్ని స్వేచ్ఛావాయువుల్ని అందించండి. మీరు జీవిత కుసుమాల్ని శ్రమైక జీవనంతో వసివాడనీయకండి. ధనార్జనకు పరిమితమెక్కడిది? తృప్తి చెందని మనుజుడు సప్తద్వీపములనైన చక్కంబడునే' అని అన్నారు పెద్దలు. కోరికలు హద్దుల్లో ఉంటే జీవితం పరిమళిస్తుంది. ఇప్పటికే చాలా పెద్ద ఉత్తరం అయింది. పిల్లలకు ఆశీస్సులు. మా అబ్బాయికి ఆశీస్సులు. ఉంటాను మరి.

నీ అత్త
భారతీదేవి

★